క్లుప్తంగా

చిరుజల్లులు..చలిగాలులు



ప్రయాణికులకు సరిపడా బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే నిల్చున్న విద్యార్థులు

పీఎం పాలెం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా శుక్రవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. చలిగాలులకు చిరుజల్లులు తోడయ్యాయి. కారు షెడ్ కూడలి బస్టాప్ వద్ద షెల్టర్ సదుపాయం పూర్తిస్థాయిలో లేకపోవడంతో బస్సుల కోసం ప్రయాణికులు, విద్యార్థులు బయటే నిరీక్షించాల్సి వచ్చింది.

చిరస్మరణీయుడు నండూరి



నండూరి ప్రసాదరావుకు నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

తగరపువలస: నగరంలోని షిప్‌యార్డు, జింక్, స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక సంఘాలను స్థాపించి, కార్మికుల తరపున పోరాడి హక్కులు సాధించిన నండూరి ప్రసాదరావు చిరస్మరణీయుడని భీమిలి జోన్ సీఐటీయూ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. ప్రసాదరావు 24వ వర్ధంతి సందర్భంగా చిట్టివలస సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులు అర్పించారు. నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, పల్ల పెంటరాజు, జోగ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: సామాజిక తనిఖీ బృందం సభ్యులు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు, వీఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తగాదాలకు తావు లేకుండా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో తప్పులుంటే గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

5 నుంచి అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమ కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబరు 5 నుంచి మూడు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాలను మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సహకారంతో నెక్ట్స్ జనరేషన్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకుల సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరచుకునేందుకు, కమ్యూనికేషన్ రంగంలో రీసెర్చ్ వర్క్‌కు ఈ ప్రోగ్రాం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, హెచ్‌వోడీ వి.శివభాస్కరరావు పాల్గొన్నారు.

అన్న సమారాధన

తగరపువలస: చిట్టివలస శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి 4వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు సహాయ సహకారాలు అందించారు.

ప్లాస్టిక్ ట్రీట

పాలిథిన్ సంపూర్ణ నిషేధానికి చర్యలు



- 8 వారాల ప్రణాళిక అమలు
- రేపటి నుంచి స్పెషల్ డ్రైవ్
- జనవరి 2 నుంచి భారీ జరిమానాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పాలిథిన్ సంపూర్ణ నిషేధానికి సమయం ఆసన్నమైంది. పాలిథిన్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి శానిటేషన్ సిబ్బంది ఇప్పటికే విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దీనికోసం 8 వారాల ప్రణాళికను అమలు చేస్తున్నారు.



పాలిథిన్ సంచి, ప్లాస్టిక్ బాటిళ్లతో పాల సరఫరా

ప్రణాళిక అమలు ఇలా..

- ఈ నెల 12 నుంచి మూడు వారాల పాటు దుకాణదారులకు, వినియోగదారులకు వివిధ మాధ్యమాలను వినియోగించి ప్రచారం చేశారు.
- డిసెంబర్ 1 నుంచి 24 వరకు ఆహార రంగం నుంచి పాలిథిన్ వినియోగం తగ్గేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ప్రజల భాగస్వామ్యంతో కమ్యూనిటీ క్లీనింగ్, నిషేధిత పాలిథిన్ వినియోగం వలన విధించే జరిమానాపై అవగాహన కల్పిస్తారు.
- డిసెంబర్ చివరినాటికి పూర్తిగా పాలిథిన్ వినియోగం నిషేధించి, రెండు రోజుల పాటు విజయోత్సవాలు నిర్వహిస్తారు.
- 2025 జనవరి ఒకటి నుంచి జరిమానాలు అమలు చేస్తారు.
- జనవరి 2 నుంచి 5 వరకు పాలిథిన్ నిషేధం పాటించని వారికి భారీగా జరిమానా విధించనున్నారు.



అంబేడ్కర్ కూడలిలో డ్రైనేజీ నుంచి వెలికి తీస్తున్న పాలిథిన్ వ్యర్థాలు



చిల్లపేట చెరువు ముఖద్వారం వద్ద పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

పాలిథిన్, ప్లాస్టిక్‌లను బహిరంగంగా కాల్చి కాలుష్యం కలిగిస్తే..

వ్యక్తిగతంగా : రూ.5,000

పరిశ్రమలకు : రూ.25,000

పాలిథిన్‌తో దొరికితే జరిమానా ఇలా..

విభాగాలు	మొదటి సారి	రెండోసారి	మూడో సారి
వ్యక్తిగతంగా	రూ.500	రూ.1000	రూ.2000
సంస్థలు, కార్యాలయాలు	రూ.5000	రూ.10000	రూ.20,000
రిటైలర్లు, వీధి దుకాణదారులు	రూ.2000	రూ.5000	రూ.10,000
తయారీ సంస్థలు	రూ.5000	రూ.10,000	రూ.20,000

ప్రమాదమని తెలిసీ..

పాలిథిన్ వలన ప్రాణాంతకమైన రోగాలు వస్తున్నాయని తెలిసినా నిరక్షరాస్యులు, కూలి పనులు చేసుకునేవారు పాలిథిన్‌ను విడిచి పెట్టలేకపోతున్నారు. టీ, జ్యూస్‌లు, చట్నీలు, కూరలు, ఇతర వేడి ఆహార పదార్థాలను పాలిథిన్ సంచులతోనే తీసుకువెళ్తున్నారు. కొన్ని దేవాలయాలలో పులిహోర, లడ్డు ప్రసాదాలను కూడా వేడిగా ఉన్నప్పుడే పాలిథిన్ సంచులలో ప్యాక్ చేస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హాని చేకూరుస్తుంది.



గతంలోనే నిషేధించినా..

వాస్తవానికి భీమిలి మున్సిపాల్టీగా ఉన్న సమయంలోనే పదేళ్ల క్రితం పాలిథిన్‌ను ఇక్కడ నిషేధించారు. పాలిథిన్‌కు ప్రత్యామ్నాయంగా కాగితపు, గుడ్డ, నార సంచులు పరిచయం చేశారు. అప్పట్లో మొక్కుబడిగా తనిఖీలు నిర్వహించడం వలన వ్యాపారులు, వినియోగదారులు సహకరించలేదు. అడపాదడపా తనిఖీలు చేస్తున్నప్పుడు నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువులు పట్టుబడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్, చేపలు, పువ్వులు, కాయగూరల దుకాణాలు, కిరాణా, మద్యం దుకాణాలలో పాలిథిన్‌తో చేసిన వస్తువులు బహిరంగంగా దొరుకుతున్నా నామమాత్రపు జరిమానాతో బయటపడుతున్నారు. ఫలితంగా పాలిథిన్ వాడకం విచ్చలవిడిగా పెరిగి డ్రైనేజీలు, చెరువులు, నదీ ముఖద్వారాల వద్ద గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వర్షాకాలంలో డ్రైనేజీలలో ప్రవహించవలసిన నీరు పాలిథిన్ అడ్డు పడడంతో రోడ్లపై నిలిచిపోతుంది. పారిశుధ్య సిబ్బంది రోడ్లపై పాలిథిన్ సంచులను కాల్చడం వలన కాలుష్యం పెరిగిపోతోంది. మరీ ముఖ్యంగా పక్షులు, పశువులు ఆహార పదార్థాలతో కూడిన పాలిథిన్ వ్యర్థాలను తిని ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నాయి. మార్కెట్‌లో కేవలం అతి తక్కువ మంది మాత్రమే నార, గుడ్డ, కాగితపు సంచులు వినియోగిస్తున్నారు.



పాలిథిన్ సంచులలో పప్పుల ప్యాకింగ్‌పై హెచ్చరిస్తున్న శానిటేషన్ సిబ్బంది



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పాలిథిన్ నిషేధంపై అవగాహన

రేపటి నుంచే నిషేధం అమలు

డిసెంబరు 1 నుంచే నిషేధం అమలులోకి వస్తుంది. జరిమానాల విధింపు మాత్రం 2025 జనవరి 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈలోగా ఎక్కువ మొత్తంలో ఎవరి వద్ద అయినా నిషేధిత పాలిథిన్ వస్తువులు దొరికితే జరిమానా విధించమని జీవీఎంసీ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. దయచేసి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి. పాలిథిన్‌కు బదులుగా జ్యూట్, వస్త్ర సంచులు వినియోగించాలి.

– బి.మహలక్ష్మినాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, భీమిలి జోన్

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల ఏడో తేదీన పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రగతిని ఈ మీటింగ్‌లో తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్, డీసీఈ బోర్డు కార్యదర్శి ఎం.వి.కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

దీర్ఘకాలం మన్నే బ్యాటరీ పరిజ్ఞానం అవసరం



డా. టాటా నర్సింహారావును సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: విద్యుత్ వాహనాలు పని చేయాలంటే దీర్ఘకాలం మన్నే బ్యాటరీలు అవసరమని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) మాజీ డైరెక్టర్, రీసెర్చ్ సలహాదారుడు డా. టాటా నర్సింహారావు అన్నారు. అవి లిథియమ్ అయాన్ బ్యాటరీలతోనే సాధ్యమని పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2030 సంవత్సరం నాటికి దేశంలో 30 శాతం విద్యుత్ వాహనాలు ఉత్పత్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. వీటి తయారీకి విద్యుత్‌ను అధికంగా నిల్వ చేసుకునే సామర్థ్యం గల లిథియం అయాన్ బ్యాటరీలు అవసరమని తెలిపారు. దేశంలో ఈ బ్యాటరీల తయారీ పరిజ్ఞానం అంతగా లేకపోవడంతో దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్నామన్నారు.

కమనీయం.. శివ పార్వతుల కల్యాణం

మధురవాడ: కార్తీకంలోని మాస శివరాత్రిని పురస్కరించుకుని మధురవాడ స్వతంత్రనగర్‌లో కొలువైన శ్రీ సాయిలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అధికార్ల కాళిదాసు, ఇతర పండితులు మధుసూదనరావు, వినీల ఇతర దంపతులతో కల్యాణ తంతు జరిపించారు. 108 కేజీల అన్నంతో అన్నాభిషేకం, అనంతరం రుద్రాభిషేకం నిర్వహించారు. పరదేశమ్మ గ్రూప్ కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 3,500మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్పొరేటర్ మొల్లి హేమలత, కొర్రాయి సురేష్, పోతిన అనురాధ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రామాద్రి శివాలయంలో..

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు హంసవన పుణ్యక్షేత్రం రామాద్రి ఆవరణలోని శివాలయంలో కార్తీక బహుళ చతుర్దశిని పురస్కరించుకుని శుక్రవారం శివపార్వతులు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వేడుక అనంతరం మహాన్నదానం నిర్వహించారు.



స్వతంత్రనగర్‌లో శివ పార్వతుల కల్యాణం

మట్టి రోడ్డే నయం

దయనీయంగా బక్కన్నపాలెంలో బీటీ రోడ్డు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెంలో ప్రధాన బీటీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రేవళ్లపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి బక్కన్నపాలెం గ్రామంలోకి వెళ్లే రోడ్డులో వార్డు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా రోడ్డు దెబ్బతిని మూడు నెలలు పైబడింది. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యిపడి సగ భాగం మట్టి రోడ్డులా మారిపోయింది. చిన్నపాటి వర్షం కురిస్తే బురద, ఎండ కాస్తే ధూళితో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ లైట్లు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రావెల్ రోడ్డును తలపిస్తున్న బీటీ రోడ్డు

అక్రమార్కుల కొత్త దందా

ప్రభుత్వ స్థలాల్లో జీవీఎంసీ పేరుతో కంటైనర్లు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడలో ప్రభుత్వ స్థలాల్లో పాగా వేయడానికి అక్రమార్కులు కొత్త రకం దందాలకు పాల్పడుతున్నారు. 6వ వార్డు కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో చెత్తాచెదారం ఎక్కువగా పేరుకుపోవడంతో ఇటీవల శానిటేషన్ సిబ్బంది, అధికారుల పర్యవేక్షణలో మొత్తం శుభ్రం చేశారు. దీంతో ఖాళీగా ఉన్న స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. వెంటనే ఆధునిక కబేళాకు చేరువలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్ ఎదురుగా ఒక కంటైనర్ తెచ్చి పెట్టేశారు. అంతటితో ఆగకుండా జీవీఎంసీ అని రాసి కాంటాక్ట్ నెంబరు కూడా ఇచ్చేశారు. ఫోన్ చేస్తే అది ప్రైవేటు వ్యక్తుల ఫోన్ నంబర్. దీనిని చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





ఓజోన్ వ్యాలీ రోడ్డులో హాస్టల్ ఎదురుగా ఏర్పాటు చేసిన కంటైనర్ (ఇన్‌సెట్) కంటైనర్‌పై జీవీఎంసీ అని, కింద నెంబరు రాసిన వైనం

అనంతుని దీపోత్సవానికి సర్వం సిద్ధం

పద్మనాభం: పద్మనాభంలో శనివారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. దీపోత్సవానికి అవసరమయ్యే తైలం, ప్రమిదలు, ఒత్తులు సిద్ధమయ్యాయి. గిరిపైకి అధిరోహించే భక్తులను నిలువరించేందుకు ప్రథమ పావంచా వద్ద, కుంతీ మాధవ స్వామి ఆలయంలో దర్శనానికి వెళ్లే భక్తులను నిలువరించేందుకు ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చనున్న గిరి ప్రథమ పావంచా ప్రాంతంలో తాటాకుల పందిరి వేశారు. గిరిపైకి వెళ్లే భక్తులు దర్శించుకునేందుకు 1200 మెట్లు వద్ద శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలు కొలువు దీరనున్న ప్రాంతంలో పందిరి వేశారు.

మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ మళ్లింపు

విజయనగరం నుంచి సింహాచలం వెళ్లే బస్సులు, వాహనాలను విజయనగరం వై జంక్షన్, రాజాపులోవ, తగరపువలస, ఆనందపురం, నీళ్లకుండీలు జంక్షన్ మీదుగా సింహాచలం పంపిస్తారు. సింహాచలం నుంచి విజయనగరం వెళ్లే బస్సులు, వాహనాలను నీళ్లకుండీలు, ఆనందపురం, తగరపువలస, రాజాపులోవ మీదుగా మళ్లిస్తారు. చిన్నాపురం, రెడ్డిపల్లి గ్రామం వైపు నుంచి దీపోత్సవానికి వచ్చే బస్సులను అర్చకునిపాలెం నుంచి తిరిగి వెనక్కి పంపిస్తారు. నీళ్లకుండీలు, మద్ది జంక్షన్ వైపు నుంచి వచ్చే బస్సులను గోస్తని బ్రిడ్జి సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ నుంచి వెనక్కి పంపిస్తారు. తగరపువలస, రేవిడి వైపు నుంచి వచ్చే బస్సులను కృష్ణాపురం క్వారీ నుంచి వెనక్కి పంపిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఈ నిబంధనలు అమలు చేస్తారు.

పార్కింగ్ స్థలాలివే..

చిన్నాపురం, రెడ్డిపల్లి మీదుగా వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనాలకు పద్మనాభం జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద గల మామిడి తోటలో, ఎమ్మార్ కళాశాల వద్ద తగరపువలస, రేవిడి మీదుగా వచ్చే వాహనాలకు సివిల్ సప్లై గొడౌన్, క్యాంప్ డేవిడ్, కస్తూర్బా స్కూళ్లు, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఖాళీ స్థలాల్లో పార్క్ చేయాలి. నీళ్లకుండీలు జంక్షన్, బోని, మద్ది మీదుగా వచ్చే వాహనాలకు జామి రవి ఇటుక బట్టీలు, పద్మనాభం గోస్తని వంతెన కింద ఖాళీ స్థలంలో పార్క్ చేయాలి,



గిరిపై కొలువు దీరనున్న అనంతుని పెద్ద ఉత్సవ విగ్రహాలు



కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు చింతాడ పూజ విద్యార్థులకు మెడికల్ కిట్ అందించి పలు సూచనలు చేశారు. రక్తహీనత రాకుండా ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలన్నారు. విద్యార్థుల వివరాలతో కూడిన ఆరోగ్య కార్డులను ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజుకు అందించారు. సీవో ఎచ్చెర్ల హరి, ఏఎన్ఎం ఎస్.హేమలత,ఆశ వర్కర్ మాదాబత్తుల స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు రోడ్ల కూడలి ఇలా..

- వేములవలస జంక్షన్‌లో గుంతలు
- వాహనచోదకుల అవస్థలు


తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలో గుంతల కారణంగా తరచూ వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పెందుర్తి మార్గం నుంచి వచ్చే వాహనాలు విశాఖ వైపు వెళ్లేందుకు ఇదే కూడలిలో మారుతుంటాయి. అలాగే తగరపువలస నుంచి వచ్చే వాహనాలు పెందుర్తి వెళ్లే సమయంలో ఈ గోతులను దాటవలసి వస్తోంది. వేగంగా వచ్చే వాహనాలు ఇందులో దిగి తడబడుతున్నాయి. ఇక్కడి నిలిచే బస్సుల నుంచి దిగే ప్రయాణికులు గోతుల కారణంగా రేగే దూళితో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఇక్కడ చెరువుగా మారిపోతుంది. ఇందులో పడి ఒక్కసారిగా వాహనాలు కుదుపులకు గురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు ఒక్కోసారి బోల్తా పడుతున్నాయి. ఈ కూడలిని ఆనుకుని ఉన్న మార్కెట్‌కు నిత్యం వేలాదిమంది వస్తుంటారు. వీరు ఈ శిథిల రహదారి కారణంగా నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోడ్ల కూడలిలో ఉన్న ఈ రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



వేములవలస కూడలిలో రహదారిపై గుంతలు

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్ఐ కె.ధర్మారావు, ఆర్ఎస్ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్ఎస్ఐ (వీఆర్) కె.గురయ్యబాబు,హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ

ఆర్టీసీ బస్ డ్రైవర్‌కు ఏడాది జైలు

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి విజయనగరానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ షేక్ మౌలాకు శుక్రవారం భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఏడాది సాధారణ జైలుశిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు. నగరంలోని మహారాణిపేటకు చెందిన సీహెచ్ సంతోషి మాలతి మృతికి సంబంధించి ఈ శిక్ష విధించినట్లు ఆనందపురం పోలీసులు తెలిపారు.

జనన ధ్రువపత్రాల జారీలో తీవ్రజాప్యం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా లేట్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్న ఐటీ ఉద్యోగులకు భీమిలి ఆర్డీవో కార్యాలయం నుంచి త్వరితగతిన క్లియరెన్స్ లభించినా, జోనల్ కార్యాలయంలో సిబ్బంది అలసత్వం కారణంగా నమోదు ఆలస్యమవుతోందన్నారు. విచారణ కూడా సకాలంలో చేయకుండా దరఖాస్తులను తమ వద్దే ఉంచుకుంటున్నారని పేర్కొన్నారు. నేరుగా సిబ్బందిని సంప్రదించినా మరొకరిపై నెపం మోపుతున్నారు తప్ప సర్టిఫికెట్లు క్లియర్ చేయడం లేదన్నారు. కొన్ని బహుళజాతి ఐటీ సంస్థలు బర్త్ సర్టిఫికెట్లు తప్పనిసరి అని అడుగుతున్నారని, అయితే అవి ఆలస్యం కావడంతో ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొన్నారు.